క్లుప్తంగా

6న విస్తృత స్థాయి సమావేశం


మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం

జగ్గంపేట: జగ్గంపేట నియోజకవర్గ వైఎస్సార్ సీపీ విస్తృత స్థాయి సమావేశం ఈ నెల 6వ తేది ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు పట్టణంలోని సాయి బాలాజీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసినట్లు మాజీ మంత్రి, ఇన్‌చార్జి తోట నరసింహం తెలిపారు. అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ భవిష్యత్ ప్రణాళికలు, కూటమి ప్రభుత్వం వైఫల్యాలపైన ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా పార్టీ అధ్యక్షుడు దాడిశెట్టి రాజా, కాకినాడ పార్లమెంట్ పరిశీలకులు సూర్యనారాయణ రాజు హాజరవుతారని పేర్కొన్నారు. నియోజకవర్గ పార్టీ ప్రజాప్రతినిధులు, వివిధ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

5న మెగా జాబ్‌మేళా

జగ్గంపేట: వికాస, జ్యోతుల పౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జూలై 5వ తేదీన జగ్గంపేట డిగ్రీ కాలేజీలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు వికాస పీడీ లక్ష్మణరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదో తరగతి నుంచి పీజీ విద్యార్థులు ఈ జాబ్ మేళాకు హాజరుకావచ్చని పేర్కొన్నారు. ఈ మేళాలో ప్రసిద్ధి చెందిన 33 కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి వివిధ కొలువుల్లో 1,350 మందికి అర్హులైన వారిని తీసుకుంటారని పేర్కొన్నారు. వేతనాలు రూ.10 వేల నుంచి రూ.45వేల వరకూ వారి స్థాయిని బట్టి నిర్ణయిస్తారని చెప్పారు. నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

విస్తారంగా వర్షాలు

ఏలేశ్వరం: అల్పపీడనం ప్రభావంతో నియోజకవర్గవ్యాప్తంగా గత రెండు రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తున్నాయి. మంగళవారం తెలవారుజాము నుంచే వర్షం పడుతూండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు చెరువుల్లో కొంతమేర నీల్వలు పెరిగడంతో రైతులు ఖరీఫ్ పనులు ముమ్మరం చేశారు. ఈదురుగాలులకు పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రహదారులు చిత్తడిగా మారి ద్విచక్రవాహనదారులకు అంతరాయం ఏర్పడుతుంది. అంటురోగాలు ప్రబలకుండా అధికారులు పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

పారిశుధ్య సిబ్బందికి సహకరించండి

ప్రత్తిపాడు: వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పెద్దాపురం డివిజనల్ పంచాయతీ అధికారి బాలామణి హెచ్చరించారు. పరిసరాల పరిశుభ్రతే ముఖ్యమన్నారు. ప్రత్తిపాడు మండలం చినశంకర్లపూడి గ్రామంలో మంగళవారం పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజలకు అవగాహన కల్పించారు. పంచాయతీ సిబ్బంది ఇళ్ల నుంచి తడి చెత్త-పొడి చెత్తలను సేకరించేందుకు ప్రజలు సహకరించాలన్నారు. ఇంటి పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఆసుపత్రుల వెంట పరుగులు తీయడం కంటే, ముందుగా మేలుకుంటే మంచిదన్నారు. కాచిన నీరు తాగాలని గ్రామస్తులకు సూచించారు. ఆమె వెంట డిప్యూటీ ఎంపీడీఓ కేవీవీఎస్ కాశీ విశ్వనాథం, సర్పంచ్ ఏపూరి రామారావు, పంచాయతీ కార్యదర్శి బి.వీరబాబు, కస్తూరి తేజా ప్రతాప్, సచివాలయ సిబ్బంది తదితరులున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

కోటనందూరు: సైబర్ నేరాలపై ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఎస్సై టీ.రామకృష్ణ సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జగన్నాథపురంలో గ్రామస్తులతో మంగళవారం పలు అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ సెల్‌ఫోన్లలో లోన్‌యాప్‌ల పేరిట సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. తెలియని యాప్‌ల జోలికి వెళ్లకూడదన్నారు. చిన్నపిల్లలు, ఆడపిల్లలపై జరుగుతున్న లైంగికదాడులు, పోక్సో చట్టం, శిక్షలపై తల్లిదండ్రులు, యువతకు అవగాహన కల్పించారు. చట్టాలను వ్యతిరేకిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. జన సంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో సీసీ కెమేరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే


వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ప్రత్తిపాడు: మండల కేంద్రం ప్రత్తిపాడులో మంగళవారం సామాజిక భద్రతా పింఛన్లను ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పంపిణీ చేశారు. గ్రామంలోని మునసబు రామాలయం వీధిలో వృద్ధాప్య, వికలాంగ, వితంతు, ఒంటరి మహిళలకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ పింఛన్ల సొమ్మును అందజేశారు. కార్యక్రమంలో ఆమె వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ కొమ్ముల కన్నబాబు, మాజీ సర్పంచ్ విశ్వేశ్వరరావు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో పడకేసిన పారిశుద్ధ్యం

- ఆధ్వానంగా పారిశుధ్య నిర్వహణ
- సిబ్బంది కొరతతో ముందుకు సాగని వైనం
- వానల నేపథ్యంలో వ్యాధుల విజృంభణ


బ్యాంకాలనీలో పందుల సంచారం


సాయినగర్‌లో రోడ్డుపై వ్యర్థాలు


ఈగలవారి వీధిలో నివాసాల చెంత అపరిశుభ్రత

తుని: పట్టణంలోని పారిశుధ్యంపై అసంతృప్తి వ్యక్తమవుతోంది. వీధులు, డ్రైనేజీలు పరిశుభ్రంగా లేవని, చెత్తాచెదారం పేరుకుపోయిందని, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు దంచి కొడుతండడంతో పరిశుభ్రత పాటించకపోతే వ్యాధులు సోకే అవకాశం మెండుగా ఉంది. తుని పట్టణం సుమారు 60 వేలకు పైగా జనాభాతో 7.02 చదరపు కిలోమీటర్లు విస్తీర్ణంలో విస్తరించి ఉంది. ఇందులో ఏటా 20 వేల మంది పలు రకాల వ్యాధులకు గురవుతున్నారని అంచనా. పట్టణంలోని పారిశుధ్యం నిర్వహణపై సోమవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో పలువురు కౌన్సిలర్లు అభ్యంతరం వ్యక్తం చేశారు.

పందుల పెంపకంతో

ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణగా పట్టణంలోని నివాసాల చెంత పందుల పెంపకంపై స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. పట్టణంలో 10 నుంచి 15 వేల వరకు పందులు ఉన్నాయి. వీటిలో సింహ భాగం పట్టణంలోని నివాస ప్రాంతాల్లో ఉన్నాయి. వీరంతా అధికారులను సైతం ప్రభావితం చేయగలరు. ఏటా రూ.కోట్లలో వ్యాపారం చేస్తున్నారు. ఎవరైనా తనిఖీలకు వస్తే భారీగా ముడుపులు ముట్టచెబుతున్నారు. దీంతో అధికారులు మౌనం వహిస్తున్నారు.

తమిళనాడుతో ఒప్పందం

రెండు నెలలకు ఒకసారి పట్టణంలో పందులను బంధించి తీసుకువెళ్లేందుకు తమిళనాడు రాష్ట్రానికి చెందిన బృందంతో మున్సిపల్ అధికారులు కాంట్రాక్ట్ కుదుర్చుకున్నారు. ఇదంతా రికార్డుల్లో చూపించిన లెక్కలు మాత్రమే. పట్టణంలో ఎక్కడ చూసినా పందుల సంచారం మాత్రం సాధారణంగానే జరుగుతోంది. ప్రజా ఆరోగ్యశాఖలో ఉన్న దిగువ స్థాయి సిబ్బంది తనిఖీల బృందాలు వస్తున్నాయన్న సమాచారాన్ని పెంపకం దారులకు ముందుగానే చేరుస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

డ్రైనేజీ వ్యవస్థ

పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో మురుగ నీటి గుంతల్లో వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. డ్రైనేజీలు పూడికతో నిండి, మురుగు నీరు రోడ్లపైకి వస్తోందని, దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. చికెన్‌గున్యా, మలేరియా, డెంగీ వంటి వ్యాధులు సోకుతున్నాయని వాపోతున్నారు. ప్రజా ఆరోగ్యశాఖ అధికారులు దోమలకు ఆవాసా కేంద్రాలుగా ఉన్న గుంతల్లో గంబూచియా చేపపిల్లలను వేస్తున్నారు. ఇవి దోమల లార్వాను తినడంతో కొంత మేర సమస్యను అరికడాతున్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యత



పట్టణంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్నాం. నివాస ప్రాంతాల్లో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. ప్రజలు చెత్త సేకరణ కోసం ఏర్పాటు చేసిన డంపర్ బిన్స్‌లో వ్యర్థాలను వేయాలి. రోడ్లపై వ్యర్థాలను వేయకుండా సహకరించాలి. రద్దీగా ఉండే రైతు బజారు, మార్కెట్లు వద్ద ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నాం. మురుగు కాల్వల్లో పేరుకుపోయిన పూడికను తొలగిస్తున్నాం. దోమల నియంత్రణ కోసం ఫాగింగ్ చేస్తున్నాం. ప్రజా ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తున్నాం.

– వెంకట్రావు, కమిషనర్,తుని.

బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ


కిర్లంపూడిలో గిరిబాబును కలిసిన పార్టీ నాయకులు, కార్యకర్తలు

కిర్లంపూడి: గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలతో నేడు పార్టీకి ప్రజాదారణ పెరుగుతోందని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. కిర్లంపూడిలోని ఆయన స్వగృహంలో పలువురు నియోజకవర్గానికి చెందిన నాయకులు మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అమలు కానీ హామీలు ఇచ్చి గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం ఏడాది గడుస్తున్న వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. దీనిని గ్రామ స్థాయిలో ఎండగట్టేందుకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన ఆదేశాలతో నియోజకవర్గ వ్యాప్తంగా 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ' అనే కార్యక్రమానికి కార్యాచరణ సిద్ధం చేశామని త్వరలో వివరాలు వెల్లడిస్తానని కార్యక్రమాన్ని నాయకులు, పార్టీ శ్రేణులు ప్రజల్లోకి విజయవంతంగా తీసుకెళ్లాలన్నారు.

వైఎస్ జగన్‌ను కలిసిన నాయకులు


జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ


జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన యువజన విభాగం సంయుక్త కార్యదర్శి హేమంత్

జగ్గంపేట: వైఎస్సార్ సీపీ కేంద్ర పార్టీ కార్యాలయం తాడేపల్లిలో మంగళవారం జరిగిన రాష్ట్ర యువజన విభాగం సమావేశానికి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తోట శ్రీరాంజీ హాజరయ్యారు. సమావేశం అనంతరం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినట్లు ఆయన తెలిపారు.

తొండంగి: వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వై.ఎస్.జగన్ మోహన్‌రెడ్డిని తొండంగి మండలం దానవాయిపేటకు చెందిన రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి మడదా హేమంత్‌కుమార్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.

ఖాళీ చేసి ఎక్కడికి పోవాలి


కుమ్మరిలోవ కాలనీవద్ద ట్రాఫిక్‌ను స్తంభింపజేసి ఆందోళన చేస్తున్న నిర్వాసితులు

- 2గంటలు పైగా స్తంభించిన ట్రాఫిక్
- పోలీసుల జోక్యంతో సర్దుమణిగిన సమస్య


ఆందోళనకారులతో మాట్లాడుతున్న రూరల్ ఎస్సై కృష్ణమాచారి

తుని రూరల్: మండలంలోని కుమ్మరిలోవ కాలనీలో ఇళ్లు కోల్పోతున్న పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్వాసితులు మంగళవారం రోడ్డుపై ఆందోళనకు దిగారు. మంగళవారం రెవెన్యూ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారానికి ఇళ్లు ఖాళీ చేయాలని డండోరా వేయడంతో నిర్వాసితులు ఒక్కసారిగా ఆందోళన చెందారు. దీంతో కాలనీవాసులంత తుని, కోట్నాం ప్రధాన రహదారిపై వాహనాల రాకపోకలను నిలిపివేసి నిరసన తెలియజేశారు. దీంతో రూరల్ ఎస్సై కృష్ణమాచారి సంఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనకారులతో చర్చించారు. నిర్వాసితులు మాట్లాడుతూ స్థలాలు ఇచ్చిన రెండు రోజుల్లో ఇళ్లు ఖాళీ చేయాలంటే ఎక్కడికి పోవాలని ప్రశ్నించారు. 472 కుటుంబాలకు చెందిన 15వందల మందికి ఇప్పటికిప్పుడు అద్దె ఇళ్లు ఎక్కడ ఉంటాయన్నారు. కేటాయించిన స్థలాల్లో కనీస సదుపాయాలు కల్పించకుండ ఇళ్లు ఏలా నిర్మించుకుంటామన్నారు. కొంత గడువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అధికారుల దృష్టికి నిర్వాసితుల డిమాండ్లను తీసుకువెళతానని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని ఎస్సై హామీ ఇవ్వడంతో శాంతించిన నిర్వాసితులు తమ సమస్య పరిష్కారమయిన తర్వాతే ఇళ్లు ఖాళీ చేస్తామని మరోసారి స్పష్టం చేశారు.

కుమ్మరిలోవ కాలనీని ఖాళీ చేయండి


ప్రసాద్, మండల తహసీల్దార్

తుని రూరల్: పోలవరం ఎడమ ప్రధాన కాలువ నిర్మాణ పనులు చేపడుతున్న నేపథ్యంలో కుమ్మరిలోవ కాలనీని ఖాళీ చేయాలని తహసీల్దార్ జీవీఎస్ ప్రసాద్ స్థానిక ప్రజలకు సూచించారు. మంగళవారం కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు. భూసేకరణలో కాలనీవాసులకు ఇళ్లు సేకరించామని, నిర్వాసితులందరికీ ఇప్పటికే ఆర్‌ఆర్ ప్యాకేజీ, ఇళ్ల స్థలాల కేటాయింపులు పూర్తి చేశామన్నారు. కాలువ పనులు వేగవంతం చేసేందుకు ఎగువన కొండపై పనులు చేస్తున్నారన్నారు. బండరాళ్లను మందుగుండుతో విచ్ఛిన్నం చేసేందుకు పేలుళ్లు జరుపుతారని పేర్కొన్నారు. ఈ పనులు శుక్రవారం నుంచి చేపడుతున్నందున నిర్వాసితులు కాలనీలోని ఇళ్లను ఖాళీ చేసి, ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకోవాలని, సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతల స్వీకరణ

కిర్లంపూడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా ఎస్.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కాకినాడ జిల్లా పంచాయితీ కార్యాలయంలో పనిచేస్తున్న శ్రీనివాస్ పదోన్నతి పొంది డిప్యూటీ ఎంపీడీఓగా గండేపల్లి మండలానికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీరాజ్ జిల్లా అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లోని పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధతో పాటు తదితర అంశాలపై శక్తి వంచనలేకుండా కృషి చేస్తానన్నారు.

షోకాజ్ నోటీసుల జారీపై ఆదేశం

శంఖవరం: ప్రభుత్వపాఠశాల్లో, అంగన్‌వాడీ కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఏపీ ఫుడ్ కమీషన్ సభ్యులు ఇ.లక్ష్మీరెడ్డి,జె.కృష్ణకిరణ్ అన్నారు. మంగళవారం మండలంలోని నెల్లిపూడి అంగన్‌వాడీ2, శంఖవరం అంగన్‌వాడీ 4 కేంద్రాల్లో తనిఖీలు చేసి రికార్డులు పరిశీలించారు. అంగన్వాడీ కేంద్రాలపై సూపర్‌వైజర్ల పర్యవేక్షణ లోపించినట్లు స్పష్టంగా కనబడుతుందని, సూపర్‌వైజర్లకు, కార్యకర్తలకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఐసీడీఎస్ సీడీపీఓ పర్వత వెంకటలక్ష్మిని ఆదేశించారు. అనంతరం స్థానిక మోడల్‌స్కూల్, జడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు. కోడిగడ్లు నాసిరకంగా ఉండి, చిట్లిపోయి ఉండడం గుర్తించారు. ఆహారాన్ని తయారుచేసి పాఠశాలకు అందించే బెండపూడి గ్రామానికి చెందిన అల్లూరి సీతారామరాజు ట్రస్ట్ నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఫుడ్ కమీషన్ సభ్యులు సూచించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డివైఈఓ ఎస్ వెంకటేశ్వర రావు, ఎంఈఓ ఎస్వీ రమణ,మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ వీర్రాజు, జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కామేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

అంటు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

జగ్గంపేట: విద్యార్థులు వర్షాకాలంలో ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని దోమలు, అంటువ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని వైద్యురాలు రూపవతి సూచించారు. జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆరోగ్య సమస్యలపై తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన సదస్సు నిర్వహించారు. స్థానిక విజయలక్ష్మి మల్టీ స్పెషాలటీ హస్పిటల్ వైద్యులు రూపవతి,డాక్టర్ వి.రాజేంద్రకుమార్ వర్షాకాలంలో వేడి ఆహారం తీసుకోవడం మంచిదని, నిల్వ పదార్థాలు తినడంతో ఇబ్బందులు ఉంటాయని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రంగారావు, తుమ్మలపల్లి ప్రభాకర్ పాల్గొన్నారు.

పీజీసెఈటీలో 11వ ర్యాంక్

జగ్గంపేట: ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన (పీజీసీఈటీ) కెమికల్ సైన్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్‌లో జగ్గంపేటకు చెందిన విద్యార్థి కణితి సోమశేఖర్ స్థాయిలో 11వ ర్యాంక్ సాధించాడు. జగ్గంపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ మంత్రి, ఇన్‌చార్జి తోట నరసింహం విద్యార్థిని శాలువాతో కప్పి పూలదండలతో సత్కరించి అభినందనలు తెలిపారు. వచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని కెమికల్ సైన్స్ విభాగంలో ఉన్నత స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు.

వైద్యవృత్తి మహోన్నతమైనది


వైద్యుడిని సన్మానిస్తున్న కౌన్సిలర్, అభివృద్ధి కమిటీ సభ్యులు

ఏలేశ్వరం: ప్రపంచ డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులను సన్మానించారు. మున్సిపల్ కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, ఆసుపత్రి అభివృద్ధి కమిటి సభ్యులు వాగు రాజేష్, జొన్నాడ వీరబాబు ఆధ్వర్యంలో వైద్యాధికారి శైలజ వైద్యులను సన్మానించారు. ప్రపంచంలో వైద్యవృత్తిని మించిన వృత్తి లేదన్నారు. ఎంతో మహోన్నతమైనదని ప్రాణదానం చేసే వైద్యుడుకు సంఘంలో ప్రత్యేకస్థానం ఉందన్నారు. భగవంతుడి తరువాత స్థానం వైద్యుడుదేనన్నారు. కార్యక్రమంలో సామంతుల గోపాలకృష్ణ, కోరాడ కృష్ణమోహన్, మామిడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బిక్కుబిక్కుమంటూ విధులు..!


నేలమట్టమైన జెడ్పీ అతిథిగృహ భవనం


శిథిలావస్థలో ఉన్న ఇరిగేషన్ కార్యాలయం

ఏలేశ్వరం: అభివృద్ధిపై పదేపదే గొప్పలు చెప్పుకొనే ప్రభుత్వం పబ్లిక్‌కు సేవలందించాలసిన భవనాలే శిథిలావస్థకు చేరుకున్నా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలోని ప్రభుత్వ కార్యాలయ భవనాలు శిథిలావస్థకు చేరడంతో ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనాల శిథిలావస్థకు చేరి ఏళ్లు గడుస్తున్నా మరమ్మతులు, పునర్నిర్మాణపనులు చేపట్టకపోవడంతో బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహించాలసి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. పట్టణంలోని జడ్పీ అతిథిగృహం నేటమట్టం కాగా వట్టిగెడ్డ సబ్‌డివిజన్ కార్యాలయం, శిథిలావస్థకు చేరుకుంది. భవనాలు పునర్నిర్మించేందుకు ఉన్నతాధికారులకు అనేకసార్లు నివేదికలు పంపినా ఇప్పటివరకు కార్యరూపం దాల్చలేదు. సబ్‌డివిజన్ కార్యాలయం పరిస్థితి అయితే మరింత దారుణంగా ఉంది. కార్యాలయం పైభాగం శ్లాబ్ పెచ్చులు ఊడిపోతున్నాయి. భవనం గోడలు బీటలు వారి కూలిపోయే స్థితిలో ఉంది. జడ్పీ అతిథిగృహం ఆవరణలో పూర్తిగా తుప్పలు పెరిగి విషసర్పాలకు నిలయంగా మారిందని ఉద్యోగులు వాపోతున్నారు. అతిథిగృహం స్థలం అక్రమణలకు గురవుతుందని, ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాల నిర్మాణాలకు చర్యలు చేపట్టాలని సిబ్బంది కోరుతున్నారు.

బాధితులకు ఆర్థిక సాయం


బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయాన్ని అందజేస్తున్న మురళీ కృష్ణంరాజు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జినపూడి గ్రామంలో ఇరువురు బాధిత కుటుంబాలను మంగళవారం వైఎస్సార్ సీపీ నరసాపురం పార్లమెంటరీ పరిశీలకుడు ముదునూరి మురళీకృష్ణంరాజు పరామర్శించారు. గ్రామానికి చెందిన సారిపల్లి చిట్టిబాబు గుండెకు స్టెంట్ వేయించుకోగ, పాలిక సురేష్ ఇటీవల కాలుకి ఆపరేషన్ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ మేరకు బాధితుల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఒక్కో కుటుంబానికి రూ.5 వేలు చొప్పున రూ.10 వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అండగా ఉంటానని బాధిత కుటుంబాలకు ఆయన భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మొల్లి వీరబాబు, నాయకులు నూకరాజు, సత్తిబాబు, వీర నాగేశ్వరరావు, రాంబాబు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కల్పనలో కేంద్ర, రాష్ట్రాలు విఫలం


నూతన యువజన సంఘం కార్యవర్గ సభ్యులతో బుగత బంగార్రాజు

ప్రత్తిపాడు: మండల కేంద్రం సీపీఐ (ఎంఎల్) కార్యాలయంలో మంగళవారం అనుబంధ సంస్థ విప్లవ యువజన సంఘం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రాజు పాల్గొని మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రతీ ఏటా కోటి ఉద్యోగాలు ఇస్తామని కేంద్ర ప్రభుత్వం, ఏటా రెండు లక్షల ఉద్యోగాలిస్తామంటూ రాష్ట్ర ప్రభుత్వాలు హామీలిచ్చాయన్నారు. కానీ ఎన్డీయే పాలన ఏడాది పూర్తయినా గానీ ఉద్యోగాల హామీ ప్రకటనలకే పరిమితమయ్యాయని నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువత పనులు లేక పొట్ట చేత్తో పట్టుకుని వలసలు పోతున్నారన్నారు. కనీసం యువతకు కంప్యూటర్ ఇంటర్‌నెట్ తదితర కేంద్రాలు ఏర్పాటు చేసి, తర్ఫీదునీయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో విప్లవ యువజన సంఘం నూతన మండల అధ్యక్షుడిగా తాడి లక్ష్మణరావు, కార్యదర్శిగా మానుకొండ నానిబాబులతో పాటు మరో 15 మంది కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు.

సమ్మెను విజయవంతం చేయండి


సార్వత్రిక సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

తుని రూరల్: ఈ నెల తొమ్మిదిన దేశవ్యాప్తంగా తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ అనుబంధ భవననిర్మాణ కార్మిక సంఘం నాయకుడు నక్కెళ్ల శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని తేటగుంటలో కార్మికలతో సమావేశమై సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలతో తీవ్ర నష్టం కలిగిస్తున్నాయన్నారు. సంక్షేమాన్ని విడిచి కార్పరేట్ సంస్థల సేవలో తరిస్తున్నారని ఆరోపించారు. భవన నిర్మాణ బోర్డులో రూ.రెండు వేల కోట్లు నిధులు ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంపై ఆందోళన వ్యక్తం చేశారు. అధికారం చేపట్టి 13 నెలలు అయినప్పటికీ ఖజానా నుంచి ఒక్క రూపాయి భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ఖర్చు చేయలేదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. దొరబాబు, ఈశ్వరరావు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అరుణాచల క్షేత్రాన్ని సందర్శించిన ఎమ్మెల్యేలు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లిలో ఆంధ్ర అరుణాచల క్షేత్రంలోని అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి ఆలయాన్ని మంగళవారం పెద్దాపురం, జగ్గంపేట ఎమ్మెల్యేలు నిమ్మకాయల చిన రాజప్ప, జ్యోతుల నెహ్రూ స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభతో కలిసి సందర్శించారు. ఈ నెల 7న అరుణాచల క్షేత్రంలో మహాశివ భక్తులైన 63 మంది నాయనార్లతో దక్షిణామూర్తి, లక్ష్మీ హయగ్రీవుడు, సూర్యభగవానుడు, కాలభైరవుడు, గంగామాత విగ్రహాల ప్రతిష్ఠ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించనున్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌తో పాటు పలువురు రాజకీయ ప్రముఖులు హాజరు కానున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు క్షేత్రంలో జరుగుతున్న ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించి పలు సూచనలు చేశారు.

నగదు బహుమతుల అందజేత

జగ్గంపేట: మండల కేంద్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు మీసాల తాతారావు ప్రతిభా పురస్కారాలను మంగళవారం అందుకున్నారు. జగ్గంపేట మాజీ సర్పంచి మీసాల తాతారావు జయంతిని పురస్కరించుకుని ఆయన సతీమణి మీసాల బంగారమ్మ, కుటుంబ సభ్యులు పదోతరగతిలో 549 మార్కులు సాధించిన లక్కాకుల నందిని, 479 మార్కులు సాధించిన అడపా శామ్యూల్‌కు రూ.5వేల చొప్పున నగదు బహుమతి అందచేశారు. ఈ కార్యక్రమంలో రిటైర్డు డ్రిల్ మాస్టర్ లక్ష్మీనారాయణ, లక్కాకుల శ్రీను, వెంట్రాప్రగడ రమేష్ తదితరులు పాల్గొన్నారు.